

# మ్యూజికల్ మ్యూజింగ్స్

- కస్తూరి మురళీకృష్ణ



**కోయి మత్‌వాలా ఆయా మేరే ద్వారే**

**అఖియోంసే కర్‌గయ అజబ్ ఇషారే!**

సాధారణంగా పాత హిందీ సినిమా సినిమాలలో తప్పనిసరిగా ఓ శాస్త్రీయనృత్య గీతం ఉండేది. ఆ పాటకు సందర్భం ఉన్నా లేకున్నా, నాయిక నృత్యం తెలిసినదయితే, ఓ సన్నివేశం నృత్యం కోసం కల్పించేవారు. ఇందువల్ల శాస్త్రీయ నృత్యం గురించి పదిమందికీ తెలిసేది. పాట శాస్త్రీయ రాగ ఆధారితం కావటం వల్ల శాస్త్రీయ సంగీతంలోని మాధుర్యం ప్రేక్షకులకు తెలిసేది. ఆధునిక సమాజంలో సినిమా అత్యంత శక్తిమంతమైన ప్రచార మాధ్యమం కాబట్టి, ఓ రకంగా, ఇలాంటి పాటలు, నృత్యాలవల్ల సంస్కృతి సాంప్రదాయాలను నిలుపుతున్న సంతృప్తి సినీ కళాకారులకు కలిగేది. కానీ అనేక సందర్భాలలో ఇలాంటి పాటలను 'సిగరెట్టు' పాటలుగా భావించేవారు. పాట రాగానే లేచి వెళ్లి సిగరెట్ కాల్చుకుని పాట అయ్యేసరికి థియేటర్లలోకి వచ్చేవారు కొందరు. అందుకని ఇలాంటి సందర్భాలను, సినిమా మొదట్లోనే పెట్టేవారు స్క్రిప్టు రచయితలు. అప్పుడే హాల్లోకి వచ్చారు కాబట్టి, పాట రాగానే సిగరెట్టు తాగేందుకు వెళ్లే వీలుండేదికాదు. అలాగయినా పాట చూడాల్సి వచ్చేది. మన కళాకారుల గొప్పతనం ఎక్కడ ప్రస్ఫుటమయ్యేదంటే, ఇలాంటి పాటలను కూడా అత్యంత ఆకర్షణీయంగా, అత్యంత రమణీయంగా రూపొందించేవారు. దాంతో ఒక్కసారి విన్నవారు పాటను మరీ మరీ వినేవారు. అలా 'సిగరెట్టు పాట' కూడా 'సూపర్ హిట్' పాట అయి సినిమాకు అదనపు ఆకర్షణగా నిలిచేది. అలాంటి పాట 'లవ్ ఇన్ టోక్యో'లో లతా మంగేష్కర్ పాడిన ఈ పాట. ఈ పాటను శంకర్ జైకిషన్ శుద్ధ దర్బారీ కానడ రాగంలో రూపొందించారు. అయితే, మధ్యలో హఠాత్తుగా కోమల 'ధ ' బదులు శుద్ధ 'ధ ' వాడి పాటకు వింత అందం చేకూర్చారు. ఈ పాటకు వారు వాడిన లయ, 'ఠేకా' కూడా హిందీ సినిమాలలో సాధారణంగా వాడని 'సీతార్ఖని' అనే పంజాబీఠేకా. దాంతో కూడా పాటకు వింత ఆకర్షణ సమకూరింది. గేయ రచయిత శైలేంద్ర బాణీకి తగ్గ పదాలు కూర్చి పాటను మరింత ఆకర్షణీయం చేశాడు.

'లవ్ ఇన్ టోక్యో' సినిమా నాయిక ఆశాపరేఖ్. ఆమెకు నృత్యం తెలుసు. ఆమె సినిమాల్లో సాంప్రదాయిక నృత్యం తప్పనిసరిగా ఉంటుంది. అందుకని 'లవ్ ఇన్ టోక్యో'లో టోక్యో టీవీలో భారతీయ యువతి శాస్త్రీయ నృత్య కార్యక్రమం ప్రసారవుతున్నట్టు, అది చూసి మన హీరో ఆమెని ప్రేమించేసినట్టు కథ అల్లి సినిమా మొదట్లోనే పాట పెట్టేశారు దర్శకుడు, స్క్రిప్టు రచయిత. ఇలాంటి పాటలకు బాణీ కట్టటం సులభం. చిత్రీకరించటం సులభం. కానీ పాట రాయటం కష్టం. ఎందుకంటే, సందర్భం లేదు. టీవీలో నాయిక నృత్యం చేస్తుంది. హీరో చూసి ప్రేమించాలి. ఇలాంటి పాటలు రాయటంలో శైలేంద్ర దిట్ట. 'మత్‌వాలా' అంటే 'మత్తులో ఉన్నవాడు' 'ప్రేమమత్తులో ఉన్నవాడు' అన్న అర్థాలు వస్తాయి. ఇష్టమైన వాడు అన్న అర్థం కూడా వస్తుంది. అలాంటి ఇష్టమైనవాడు ఆమె ద్వారం వద్దకు వచ్చి, కళ్లతో గమ్మత్తయిన సౌంజ్ఞలు చేశాడట. గేయ రచయిత గొప్పదనం పాట ఆరంభంలోనే తెలిసిపోతోంది.

ఆమె మనసు ద్వారం వద్దకు వచ్చి కళ్ళతో సౌంజ్ఞలు చేసేవాడు, టీవీలో ఆమెను చూసి మనసునిచ్చేశాడు ఇక పాటలో చరణాలను కొనసాగించిన తీరు పరమాద్భుతం.

**క్యా మన్ ఉస్‌కే మై క్యా జానూ**

**ఛలియా కో మై క్యా పహెచానూ**

**జానే క్యోం మేరా నామ్ పుకారే...**

ఆమె ఇంకా హీరోను చూడలేదు. కానీ టీవీ ముందున్న అతని హృదయ స్పందన ఆమెకు వినిపించినట్టు చమత్కారంగా గేయాన్ని రచించాడు శైలేంద్ర. అతని హృదయంలో ఏముందో ఈమెకేం తెలుసు? మోసగాడు అతడిని ఎలా గుర్తుపడుతుంది? ఎందుకని అతడు ఆమెని పిలుస్తున్నాడో అంటోంది.

**జబ్ సే గయా హై భోలా బచ్‌పన్**

**అఖియా చంచల్, నట్‌ఖట్ హై మన్**

**అగే నహీ కుఛ్ బీ బస్ మే హమారే...**

చాలా సరళంగా చెప్పాల్సింది చెప్పేశాడు, సూచించాల్సింది సూచించేశాడు శైలేంద్ర. అమాయకమైన బాల్యం వెళ్లిపోయినప్పటినుంచీ ఆమె కళ్లు చంచలమైపోయాయట, మనస్సు అల్లరి చేస్తోందట. ఆమె నియంత్రణలో ఏమీ లేదట. అలాంటి పరిస్థితిలో ఓ ప్రియుడు కళ్లతో సౌంజ్ఞలు చేస్తున్నాడు. సందర్భానికి తగ్గట్టు కుదిరింది. ఇక తరువాత జరిగే ఏ సంఘటనపై కూడా నాయికకు నియంత్రణ ఉండదు. సందర్భం లేని చోట సందర్భం కల్పించి పాటకు వీలు కల్పిస్తే గేయ రచయిత అత్యంత చమత్కారంతో దాన్ని సందర్భోచితంగా రచించటం పరమాద్భుతమైన సృజనాత్మక కళాకౌశలం.

**మేరే సంగ్‌గా గున్ గునా, కొయి గీత్ సుహానా..**

'జాన్‌వర్ ' సినిమాలో రాజశ్రీ పై చిత్రితమైన ఈ పాటను రాసింది హస్రత్ జై పురి. రాగేశ్రీ రాగంలో తీన్‌తాళ్‌లో శంకర్ జై కిషన్ దాదాపుగా శుద్ధ రాగంలానే ఈ పాటను రూపొందించారు. ఇందుకు ప్రధాన కారణం రాజశ్రీ, ఆశాపరేఖ్ అంత గొప్పగా నాట్యం తెలిసిన నటి కాదు. ఈ పాట పాడిన సుమన్ కళ్యాన్ పుర్, లతా మంగేష్కర్ అంత చక్కగా శాస్త్రీయ సంగీత రాగాలను పాడలేరు. ముఖ్యంగా హై పిచ్‌లో 'నోట్'ను సాగదీయటం లతలా ఎవ్వరికీ రాదు. అందుకని, ఎలాంటి ప్రయోగాలు చేయకుండా 'శుద్ధ'రాగంలోనే పాటను రూపొందించాడు శంకర్ జైకిషన్. తాళం కూడా సాధారణంగా వాడే 'తీన్‌తాళ్' వాడేడు. దాంతో పాటకు బాణీ, వాయిద్యాల వాడకం ప్రధానమయ్యాయి. హస్రత్ జైపురి పాటను చాలా సరళంగా రాశాడు. ఈ పాట సమయానికి నాయికా నాయకులకు పరిచయం అవుతుంది .ప్రేమ భావన అంకురం పడుతుంది. అందుకని 'నాతో కలసి మధురమైన గీతం పాడమని ' పాటను ఆరంభించింది నాయిక.

**మై భి తుమ్హారీ, దిల్ భి తుమ్హారీ**

**తాంగ్ సాథ్ జగ్ జగ్ సె హమారా**

**తేరిహీ కద్‌మోమే సర్‌మేరా...**

సుమన్ స్వరాన్ని, లత స్వరంతో వేరు చేసి చూడటం కష్టం, ఇరువురి స్వరాలతో ఎంతో పరిచయం ఉన్నవారికి తప్ప. మిగతావారు సుమన్ పాటలను లత పాటలుగా పొరపడతారు. కానీ జాగ్రత్తగ వినేవారికి సుమన్ గొంతులో అనవసరమైన కంపనం, లత గొంతులో జాలువారే తీయదనరాహిత్యం తెలిసిపోతూంటూంది. అంతేకాదు, హైపిచ్‌కి వెళ్లినప్పుడు లతలా 'నోట్'ని పట్టి సాగదీయటం సుమన్ చేయలేదు. 'సర్‌మేరా' అన్నచోట గమకాలు సుమన్‌ను పట్టిస్తాయి. పాటలో భావం ఎలాంటి ప్రత్యేకత లేనిది. నేను నీదాన్నే, నా హృదయం నీదే, మనిద్దరం యుగయుగాల నుంచీ కలుస్తూనే ఉన్నాం. నీ పాదాల వద్ద నా శిరస్సు ఉంటుంది అంటోంది నాయిక.

**దేఖో బిజ్‌లీ డోలె బిన్ బాదల్ కీ,**

**ఛం ఛం చంకత్ మాథేకి బిందియా**

**ఝునన్ ఝునన్ ధున్ పాయల్‌కీ**

'ఫిర్ వ హీ దిల్ లాయా హూన్' అనే సినిమా ఆరంభగీతం ఇది. నాయిక నృత్య కౌశల ప్రదర్శన కోసం ఈ ద్రుశ్యాన్ని సృష్టించారు. నాయిక, మరోనటి పోటీగా నృత్యం చేస్తూంటారు. ఆ సందర్భంలో ఈ పాట వస్తుంది. సంగీత దర్శకుడు ఓ.పి.నయ్యర్. ఈ పాటకు భైరవ్ థాట్‌కు చెందిన 'రామ్ కలి' రాగంలో రూపొందించాడు. పలువురు ఈ పాటను భైరవ్ రాగ ఆధారితం అనుకుంటారు. 'రామ్ కలి' రాగం ఉదయం పూట పాడే రాగం. భక్తి భావం పొంగి పొర్లుతుంది ఈ రాగంలో. సిక్కుల పవిత్ర గ్రంధం 'గురు గ్రంథ్ సాహిబ్' లోని కీర్తనలను ఈ రాగంలోనే పాడతారు. దాంతో పాటకు ఒక వింత అందం, పవిత్రత, ఆకర్షణలు సమకూరాయి. దీనికి మజ్రూహ్ సుల్తాన్ పురి పొదిగిన భావాలు

బంగారానికి తావి అబ్బినట్టుంటాయి. ఆశాభోంస్లే, ఉషా మంగేష్కర్ పాడిన ఈ పాటకు తెరపై నృత్యం ఆశాఫరేఖ్, రాణిలు చేయగా, బేబీ నాజ్, తబస్సుంలు పాట పాడతారు తెరపై. ఈ పాటకు నృత్యం రూపొందించిన 'సరోజ్ ఖాన్' కూడా కనిపిస్తుంది. 'మేఘాలు లేకుండా మెరుపు మెరిసిందట', అంత అద్భుతంగా ఉంది వారి నృత్యం. గజ్జెల లయకనుగుణంగా, నుదిటిపై బొట్టు మెరిసిందట. చక్కటి భావాన్ని అతి చక్కగా ప్రదర్శించాడు మజ్రూహ్. పాట వినగానే ఆకర్షిస్తుంది. పూర్తయ్యే వరకూ కదలకుండా చూసేట్టు చేస్తుంది.

అంటే, ఆనాటి కళాకారులు, సంస్కృతి, సాంప్రదాయాలను వదలకుండా, వ్యాపారం కోసం సర్వం త్యజించకుండా సినిమాలలో ఏదో ఓ సందర్భంలో ఇలాంటి పాటలను చొప్పించేవారన్నమాట. 'ఆజాద్' సినిమాలో 'అప్లమ్ చప్లమ్' పాట ఇలాంటిదే. నిజానికి ఈ పాటకు సందర్భం లేదు. కానీ అద్భుతమైన పాట, అద్భుతమైన గానం నృత్యం. ఎన్నిమార్లు విన్నా, చూసినా తనివి తీరదు. అలాగే, 'మొఘల్ – ఎ – అజమ్'లో 'మోహెపన్ ఘట్ పే నంద్ లాల్ ఛేద్ గయోరే' పాటకూడా ఇలాంటిదే. 'గారా' రాగంలో రూపొందిన ఈ సాంప్రదాయక గీతం సినిమాలో కళ్లు కదలనీయకుండా చూసేట్టు చేస్తుంది. నిజానికి మధుబాలకు శాస్త్రీయ నృత్యం రాదు. కానీ, ఆ లోపం తెలియనీయకుండా, చాలా సులువైన కదలికలతో, వీలయినన్ని క్లోజప్పులతో, మధుబాల మనోహరమైన చిరునవ్వుతో ప్రేక్షకులను మంత్ర ముగ్ధులను చేస్తుందీ పాట. 'దిల్ హీతో హై ' సినిమాలో కూడా శాస్త్రీయ నృత్యం కోసం సందర్భం కల్పించారు. ఓ నృత్య ప్రదర్శనలో కవిత చెప్పే కవి రాడు. మన హీరో ఓ ముసలాయన వేషం వేసుకుని పాట పాడి, పాటకు తగ్గ నృత్యం చేయమంటాడు. ఇంకేం, అద్భుతమైన పాట రూపొందింది. భైరవి రాగానికి పాఠంలాంటి 'లాగా చున్రీమె దాగ్' పాటను ఈ సందర్భంగా సృజించాడు సంగీత దర్శకుడు రోషన్. పాట స్థాయిని ఆధ్యాత్మిక స్థాయి ఎదిగించాడు సార్వజనీన భావాలతో గేయ రచయిత సాహిర్ లూధియాన్వీ.

**'లాగా చున్‌రీమె దాగ్ చుపావు కైసే, ఘర్ జావూ కైసే'**

ఇదీ పాట ఆరంభం. ఆమె కొంగుపై మరక ఏర్పడిందట. 'ఈ మరకను ఎలా దాచాలి, ఇంటికి ఎలా వెళ్లాలి ' అని పాడుతున్నాడూ హీరో. అతని పాటకు తగ్గట్టు నాట్యమాడుతూంటుంది నర్తకి.

**హోగయి మైలీ మోరి చునరియా**

**కోరే బదన్‌సీ కోరి చునరియా**

**జాకే బాబుల్ సే నజరే మిలావూ కైసే, ఘర్ జావూ కైసీ...**

ఆమె తెల్లటి శరీరంలా తెల్లగా ఉండే ఆమె కొంగు మైల అయిపోయింది. ఇప్పుడు వెళ్లి పుట్టింటి వాళ్లకు ముఖం ఎలా చూపించాలి? ఇంటికి ఎలా వెళ్లాలి? అంటూ పాడుతున్నాడు హీరో. ఇక్కడ మరక, తెల్లటి కొంగు, పుట్టింట్లో మొహం చూపించటం అన్నీ ఆధ్యాత్మిక ప్రతీకలు. ఈ విషయం ఇంకా అర్థంకాని వారికోసం రెండో చరణంలో వివరిస్తాడు సాహిర్.

దాంతో పాట స్థాయి మారిపోతుంది. శాస్త్రీయ సంగీత ఆధారిత శాస్త్రీయ నృత్య గీతం స్థాయినుంచి ఆధ్యాత్మికభావనలతో అలరారే అత్యుత్తమ గీతంలా ఎదుగుతుంది పాట.

**కోరి చునరియా ఆత్మ మోరి, మైల్ హై మాయాజాల్**

**వో దునియా మోరె బాబుల్ కా ఘర్, యే దునియా ససురాల్**

**జాకె బాబుల్ సే నజరే మిలావూ కైసే, ఘర్ జావూ కైసే?**

పాట స్థాయి మారిపోతుందీ చరణం తోటే, ఒక మామూలు సందర్భంలో వచ్చే మామూలు పాటను ఎంత లోతైన భావంతో ఎంత ఎత్తుకు ఎదిగించాడు గేయ రచయిత సాహిర్. ఆమె తన తెల్లటి కొంగుపై మరక అయింది, పుట్టింటికి ఎలా వెళ్లాలి, ఇంట్లో వాళ్లకి ఎలా ముఖం చూపించాలి' అని పాడుతోంది. కానీ అక్కడ తెల్లటి కొంగు ఆత్మ.

మరక ఈ ప్రపంచం అనే 'మాయాజాలం'. పుట్టినిల్లు అంటే భగవంతుడి ప్రపంచం. ఈ మాయలో ముంచే మానవ ప్రపంచం మెట్టినిల్లు. పుట్టినింటి నుంచి పరిశుద్ధంగా మెట్టినింటికి వచ్చి, మెట్టినింటి మాయాజాలంతో ముగ్ధుడయి ఈ మాయాజాలమనే మరక అంటించుకుంటున్నాడు. ఇప్పుడు మళ్లీ పుట్టింటికి ఏ ముఖం చూపిస్తాడు? అదీ పాట.

తాత్త్విక సిద్ధాంతం ప్రకారం ప్రతి మానవుడిలో పరమాత్మ అంశ ఉంటుంది. పరమాత్మ శుద్ధ చైతన్యం. అనంతమైన ఆ శుద్ధ చైతన్యం మానవ శరీరంలో ఒదిగి 'అంతమున్నదవుతుం'ది. ఈ భౌతిక సరీరమే సర్వస్వం అనుకుని ఆనంద విషాదాలు, సుఖదుఃఖాలు అనుభవిస్తుంది. క్రోధలోభ మద మాత్సర్యాలకు లోనవుతుంది. స్వచ్ఛమైన పరిశుద్ధాత్మ మలినమయమవుతుంది. తన అనంతత్వాన్ని విస్మరిస్తుంది. మాయాజాలపు మరక నంటించుకుంటుంది. పలు ధర్మాలలో ఈ ఆలోచన ఉంది. ఈ భూమి మీద చేసిన పనుల 'చిట్టా ' భగవంతుడికి చెప్పుకోవాలి. పశ్చాత్తాప పడాలి. భారతీయ ధర్మంలో చిత్రగుప్తుడి 'చిట్టా' ఉండనే ఉంది. చేసిన ప్రతి పని ఫలితం అనుభవించక తప్పదన్న సిద్ధాంతం ఉంది. 'జవాబుదారీ' అన్నది ఉంది. అందుకని, పుట్టినింటికి వెళ్లి తల ఎత్తుకుని ఎలా నిలబడాలి? కళ్లల్లోకి సూటిగా చూస్తూ ఎలా మాట్లాడాలి? 'లాగా చున్ రీమే దాగ్' అంటున్నాడు కవి. అంతేకాదు, భగవంతుడి ముందు ఏదీ దాచలేము, అబద్ధం చెప్పలేము, మసిపూసి మారేడూ కాయ చేయలేము. అందుకే 'ఛుపావూ కైసే ఘర్ జావూ కైసే?' అని వాపోతున్నాడు. ఈ అర్థం తెలిసిన తరువాత ఈ పాటను మామూలు నృత్య గీతంలా, చూడగలమా? సిగరెట్ పాటలా భావించగలమా? ఆ కళాకారుల ప్రతిభకు శిరస్సు వంచి మనస్ఫూర్తిగా నీరాజనాలర్పించటం తప్ప, వారు సృజించిన కళను అర్థం చేసుకుని, ఆనందిస్తూ, ఆ ఆనందాన్ని ఇతరులకు పంచటం తప్ప మరేమీ చేయలేము.

వచ్చేనెల మరిన్ని మధురమైన పాటలతో కలుద్దాం.

Post your comments